సాక్షి వరంగల్

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

కానిస్టేబుళ్లు శిక్షణను పూర్తిచేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని టీఎస్‌ఎస్పీ కమాండెంట్ అన్నారు. - IIలో▸



పర్సంటేజీల కోసం కక్కుర్తి

ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని ఓ రూరల్ డివిజన్ అక్రమాలకు కేరాఫ్‌గా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. - IIలో▸

గరిష్టం/కనిష్టం
35^0 /19^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా సంధ్యారాణి

కరీమాబాద్ : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా గట్టు సంధ్యారాణి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. ఇటీవల వరంగల్ అదనపు కలెక్టర్‌గా నియమితులైన కె.ఆదిలక్ష్మికి డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీలో పోస్టింగ్ ఇచ్చారు. వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సంధ్యారాణిని వరంగల్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్స్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కానుగుల శ్రీనివాస్‌ను జిల్లా రెవెన్యూ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఐదుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వై.సుధాకర్ రెడ్డి కాజీపేట పోలీస్‌స్టేషన్, సీహెచ్.శ్రీధర్ కేయూసీ నుంచి వీఆర్‌కు, వి.చేరాలు వీఆర్ నుంచి కేయూసీ, డి.రవిరాజు వీఆర్ నుంచి పరకాల, ఎం.అబ్బయ్య పరకాల నుంచి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

రచనలు సమాజానికి ఉపయోగపడాలి





సంగెం : సమాజంలోని మూఢనమ్మకాలు, చెడును పారదోలి ప్రజలను చైతన్యవంతులను చేసే రచనలు చేయడం అభినందనీయమని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య అన్నారు. సంగెం ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య రాసిన 'మెట్టుపల్లి చైతన్య గీతాలు' పుస్తకాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాటల కంటే ఎక్కువగా పాటలకు ప్రతి హృదయం త్వరగా స్పందిస్తుందని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి రచయిత మల్లయ్య సామాజిక, ఆర్థిక అంశాలను తన పాటలో ఉపయోగించారని తెలిపారు. రచయిత మెట్టుపల్లి మల్లయ్య, డప్పు కళాకారుడు కొమురయ్యను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కళావతి, రచయిత, ఉపాధ్యాయుడు చిలువేరు శ్రీనివాస్, పుస్తక సమీక్షకులు కొమురయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రంగరాజు నర్సింహస్వామి, కొనకటి మొగిలి పాల్గొన్నారు.


అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

నర్సంపేట రూరల్ : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటలో జరిగిందని ఎస్సై శీలం రవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ద్వారకపేటకు చెందిన ఒగ్గుల రాజు (35) అదే గ్రామానికి చెందిన పాలేటి రవి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం పాలేటి రవి ఇంటి వద్ద దేవుడిని చేసుకున్నాడు. ఈ క్రమంలో ఒగ్గుల రాజు, ప్రశాంత్‌ను భోజనానికి పిలిచాడు. రాత్రి 11 గంటలకు అంబర్ కావాలని రాజును ప్రశాంత్ కోరగా లేదని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ప్రశాంత్.. రాజును ఛాతిపై కొట్టడంతో కిందపడిపోయాడు. ఇరుగుపొరుగు వారు వచ్చి నచ్చజెప్పడంతో వెంటనే రాజు లేచి ఇంటికి వెళ్లి మంచినీళ్లు తాగి పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున భార్య జ్యోతి లేచి భర్త రాజును లేపడానికి ప్రయత్నించింది. కదలికలేకపోవడంతో లేకపోవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. రాజు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు


విష్ణుతేజ


వరుణ్‌సందేశ్


ఇఫ్రాన్‌పాషా

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి, దుగ్గొండి గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పుప్పాల ఎల్లయ్య తెలిపారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో నాచినపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థులు గోవింద్ విష్ణుతేజ, బోళ్ల వరుణ్‌సందేశ్, దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి విద్యార్థి సయ్యద్ ఇఫ్రాన్‌పాషా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

హైటెక్ మేడారం



ఆధునిక టెక్నాలజీ వినియోగం

- సీసీ కెమెరాలు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, డ్రోన్‌లు
- పెరిగిన సెల్‌టవర్లు అడుగడుగునా ఇంటర్నెట్ సౌకర్యం
- ప్రత్యేక యాప్ రూపకల్పనలో అధికారులు



ఎస్‌ఎస్ తాడ్వాయి:

మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరలో ఈసారి అధికారులు ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు సులువుగా సేవలందించేందుకు, భక్తుల రద్దీ పర్యవేక్షణ, అధికారుల సమన్వయం, భక్తుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు గమనించేందుకు అధికారులు ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ మేరకు పోలీస్, జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా జాతరకు సంసిద్ధమవుతున్నారు.




చిలకలగుట్టకు వెళ్లే జంక్షన్‌లో సీసీ కెమెరా బిగిస్తున్న సిబ్బంది

నిఘానేత్రాల వలయంలో...

జాతరంతా నిఘా నేత్రాల వలయంలో జరగనుంది. ఈసారి కోటిన్నర పైగా భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా. ఇందుకోసం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతర పరిసరాల్లో 500 సీసీ కెమెరాలు, 15 డ్రోన్‌లు, వాకీటాకీల ద్వారా భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోనున్నారు. ప్రతియేటా జాతరలో టెక్నాలజీ పాత్ర ఉన్నప్పటికీ ఈసారి ఆధునిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎక్కడ కూడా చిన్న సమస్య తలెత్తినా సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా పర్యవేక్షించనున్నారు. మేడారంలోనే కాకుండా తాడ్వాయి ఆర్టీసీ బస్టాండ్, పస్రా క్రాస్ నుంచి మేడారం వైపు వరకు ప్రతీచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లో భక్తుల ఇబ్బందుల సమాచారం తెలిపేందుకు టోల్ ఫ్రీ 1800-425-0620 నంబర్ ఏర్పాటు చేశారు. ఈ నెల 19 నుంచి భక్తులకు ఈ టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి వస్తుంది.

స్మార్ట్ సేవలు...

జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తుల్లో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు ఉంటాయి. బీఎస్‌ఎన్‌ఎల్‌తోపాటు మరో కంపెనీ శాశ్వత సెల్‌టవర్లు ఏర్పాటు చేయడంతోపాటు చుట్టూరా బూస్టర్లు పెడుతుండడంతో మెరుగైన సిగ్నల్ ఉండనుంది. దీంతో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడంతో ఏ చిన్న వస్తువు కొనుగోలు చేసినా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా చెల్లింపులు చేసే అవకాశం ఉంది. దేవాదాయ శాఖ కూడా గత జాతర నుంచి భక్తులకు క్యూఆర్ కోడ్ ద్వారా కానుకలు చెల్లించేలా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది.

అధికారులకు వాట్సాప్ గ్రూపు

మహాజాతరలో సెక్టార్ల వారీగా విధులు నిర్వహించే అధికారులు, జిల్లా ఉన్నతాధికారుల మధ్య సమన్వయం ఉండేలా.. సమాచార మార్పిడికి ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేస్తున్నారు. దీని ద్వారా క్షణాల్లో సెక్టార్‌లో ఏర్పడిన సమస్యలు ఉన్నతాధికారులకు తెలిసే అవకాశం ఉంది. అంతేకాకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు కూడా క్షణాల్లో సెక్టార్ అధికారులకు చేరుతాయి. మహాజాతర జరిగే కీలక నాలుగు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండేలా ఈ టెక్నాలజీ ఉపయోగపడనుంది.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రత్యేక యాప్ రూపకల్పన..

జాతరకు వచ్చే భక్తులకు అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, సమీప ప్రదేశాల (వైద్యశిబిరం, టాయిలెట్స్, తాగునీరు, ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు) వివరాలు సునాయాసంగా తెలిసేలా అధికారులు ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇది అందుబాటులోకి తీసుకువచ్చి జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, త్వరగా, సులభంగా అమ్మవార్ల దర్శనం చేసుకునేలా యాప్‌లో సమాచారం అందించనున్నారు.

నేడు మేడారంలో మంత్రి పర్యటన

మేడారంలో శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ముందుగా అమ్మవార్లను దర్శించుకుని జాతర ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, మీడియా పాయింట్, హరిత హోటల్, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణు గోపాల్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డీపీఓ వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

పటిష్ట చర్యలు చేపడుతున్నాం..



మేడారం జాతరలో పోలీస్ శాఖ తరఫున పటిష్ట చర్యలు చేపడుతున్నాం. 14వేల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. మేడారం పరిసరాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ట్రాఫిక్, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ శబరీష్, ఎస్పీ, ములుగు

ముగిసిన ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ

వరంగల్ : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాముల్లో ఈనెల 5న చేపట్టిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ శుక్రవారం ముగిసిందని ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఈసందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్లు నిర్వహించిన మాక్‌పోలింగ్‌ను కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. మాక్‌పోలింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 500 ఓట్లకు 20 ఈవీఎంలు, వెయ్యి ఓట్లకు 20 ఈవీఎంలు, 1,200 ఓట్లకు 12 ఈవీఎంలను మాక్‌పోలింగ్‌లో వినియోగించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓట్లు వేయించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ రిజల్ట్, వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కించి సరిసమానంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. మాక్‌పోల్, లెక్కింపు, సరైన నిర్ధారణ అనంతరం సాయంత్రం ఈవీఎంలను పోలీస్ భద్రత మధ్య స్ట్రాంగ్‌రూంలకు తరలించి అధికారులు సీల్ వేశారు. జిల్లాకు సంబంధించి వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల్లోని ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియలో 1,848 బ్యాలెట్ యూనిట్లు, 1,019 కంట్రోల్ యూనిట్లు, 1,212 వీవీ ప్యాట్లను ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ధ్రువీకరించింది. ఆర్డీఓలు వాసుచంద్ర, రమేష్, ఎన్నికల పర్యవేక్షకులు రమేష్, నాయబ్ తహసీల్దార్లు రంజిత్‌కుమార్, హనీఫ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ.శ్రీనివాస్‌రావు, దాసరి రాజేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, యాదగిరి, ఫాయాజ్, అనిల్‌కుమార్, ఈసీఐఎల్ ఇంజనీర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఈసీఐఎల్ ఇంజనీర్లు

గడువులోగా లక్ష్యాలను పూర్తిచేయాలి

- డీఆర్డీఓ కౌసల్యదేవి

కరీమాబాద్ : మహిళలు ఆదాయ అభివృద్ధి, సుస్థిర జీవనోపాధి కల్పన, ఆర్థిక, సామాజిక మార్పునకు శ్రీకారం చుట్టేలా సెర్ప్ ఉద్యోగులు పనిచేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) డీఆర్డీఓ కౌసల్యదేవి ఆదేశించారు. డీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సీసీలు, ఏపీఎంల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సెర్ప్ కార్యక్రమాలతో స్వయం సహాయక సంఘాల సభ్యులను అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్ది, జిల్లా ప్రథమ స్థానం సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులో పూర్తిచేయాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అడిషనల్ డీఆర్డీఓ మునిగాల దయాకర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు అనిత, ఏపీఎంలు వీర్ల వేణు, పులుసు అశోక్, సురేష్, కిరణ్, సుధాకర్, వేణుగోపాల్, ధర్మేందర్, ప్రేమ్‌రాజ్ , సీసీలు గోలి కొమురయ్య, రమేష్‌కుమార్, కృష్ణమూర్తి, సీసీలు, సీబీఓలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్డీఓ కౌసల్యదేవి

మెరుగైన వైద్యసేవలందించాలి : డీహెచ్

ఎంజీఎం: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌ఓలతో ఐఎంఏహాల్‌లో పలు కార్యక్రమాలపై శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర సంచాలకులు (డీహెచ్) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సంక్షేమ, మాతా శిశు సంరక్షణ, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు, టీబీ, ఎయిడ్స్ వివిధ రకాల వ్యాధులు, నివారణ చర్యలపై సమీక్షించి సూచనలు చేశారు. అనంతరం డీహెచ్‌ను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సమీక్షలో హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్‌ఓలు సాంబశివరావు, వెంకటరమణ, అదనపు డీఎంహెచ్‌ఓలు మదన్‌మోహన్‌రావు, గోపాల్‌రావు, వైద్యాధికారులు యాకూబ్‌పాషా, పద్మశ్రీ, హిమబిందు, ఉమశ్రీ, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న డీహెచ్ రవీంద్రనాయక్

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో శ్రేయాన్ ప్రతిభ

రాయపర్తి : రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.శ్రేయాన్ ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల ఆన్‌లైన్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌లో ఎకో ఫ్రెండ్లీ మస్కిటో కిల్లర్ అనే పరికరాన్ని ఆయన ప్రదర్శించినట్లు తెలిపారు. ఇందులో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థి శ్రేయాన్‌తోపాటు గైడ్ టీచర్ ప్రవీణ్‌రెడ్డిని పాఠశాలలో శుక్రవారం అభినందించారు.

సిరిసిల్ల రాజయ్యను వరించిన పదవి

- టీఎస్‌ఎఫ్‌సీ చైర్మన్‌గా నియమించిన ప్రభుత్వం
- సభ్యుడిగా కురవి మండల వాసి నెహ్రూనాయక్
- ఉత్తర్వులు జారీచేసిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్


సిరిసిల్ల రాజయ్య


నెహ్రూనాయక్

సాక్షిప్రతినిధి, వరంగల్ : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (టీఎస్‌ఎఫ్‌సీ) చైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను ప్రభుత్వం నియమించింది. చైర్మన్‌తోపాటు నలుగురు సభ్యులను నియమించిన ప్రభుత్వం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల శివారు లింగ్యాతండాకు చెందిన మాలోత్ నెహ్రూనాయక్‌కు సభ్యుడిగా అవకాశం కల్పించింది. ఈ మేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సాయంత్రం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా లింగాపూర్‌లో 1953 అక్టోబర్ 5న సిరిసిల్ల రాజయ్య జన్మించారు. ఆయన తల్లిదండ్రులు శాంతమ్మ, బక్కయ్య. సామాన్య కుటుంబంలో జన్మించిన రాజయ్య అనేక వ్యయప్రయాసలకోర్చి ఉన్నత విద్యనభ్యసించారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ (అగ్రికల్చర్)లో పట్టా పొందారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం పొందిన రాజయ్య ఎంపీడీఓగా, జెడ్పీ డిప్యూటీ సీఈఓగా, సీఈఓగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. పదవీ విరమణ తర్వాత భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీలకంగా వ్యవహరించారు. 2009 పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనకు వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించగా.. బీఆర్‌ఎస్, టీడీపీ అభ్యర్థులు డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్యపై విజయం సాధించారు. 2009 నుంచి 2014 వరకు వరంగల్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి చేతిలో ఓడిపోయారు. కడియం శ్రీహరి రాజీనామా చేయడంతో సిరిసిల్ల రాజయ్యను 2015 ఉపఎన్నికలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ ఎంపిక చేసింది. మనవలు, కోడలు ప్రమాదవశాత్తు మరణించడంతో రాజయ్య పోటీ చేయలేదు. 2019లో టికెట్ ఆశించగా దొమ్మాటి సాంబయ్యకు చాన్స్ ఇచ్చారు. ఈసారి వరంగల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్న సిరిసిల్ల రాజయ్యను ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలి

- రైతు, కార్మిక సంఘాల నాయకుల డిమాండ్
- నర్సంపేట పట్టణంలో భారీ ర్యాలీ

నర్సంపేట : రైతు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా చేపట్టిన గ్రామీణ బంద్, సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వరంగల్ రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా పాకాల రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా సమ్మయ్య, ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అనంతగిరి రవి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గుంపల్లి మునీశ్వర్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా కార్మికులు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ కోడ్‌లు అమలులోకి వస్తే కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలుకుతుందని, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 8 గంటల పనివిధానం పోయి రోజుకు 12 గంటల పనిచేసే విధంగా చట్టంలో సవరణలు తీసుకొస్తుందని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, ఆహార, నిత్యావసర వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో చేస్తున్న రైతుల పోరాటంపై జరుగుతున్న పోలీసుల దమనకాండను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి గతంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంటకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొరబోయిన కుమారస్వామి, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వడిచర్ల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ శ్రీధర్, కందికొండ రాజు, ఏఐఎఫ్‌టీయూ హమాలీ నాయకులు మల్లయ్య, జనార్దన్, శ్రీను, తాపీమేస్త్రీల సంఘం డివిజన్ అధ్యక్షుడు రుద్రారపు పైడయ్య తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

పది ఫలితాల్లో జిల్లాను ముందుంచాలి

దేశాయిపేట : పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ముందుంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషిచేయాలని డీఈఓ డి.వాసంతి సూచించారు. దేశాయిపేటలోని లక్ష్మి గార్డెన్స్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకుని ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఓరియంటేషన్ కార్యక్రమానికి 65 పాఠశాలల నుంచి 750 మంది విద్యార్థులు హాజరయ్యారు. ట్రస్మా రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్.రమేష్‌రావు, అడ్వైజర్ కె.భూపాల్‌రావు, డీసీఈబీ చైర్మన్ కృష్ణమూర్తి, ఎంఈఓ విజయ్‌కుమార్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ గుమ్మడవెల్లి సురేష్, నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.పంతులరామ్మూర్తి, వి.రాధాకృష్ణ, ఎస్.సూర్యనారాయణ, బొల్లం కనకయ్య, ఆర్.రవి, జె.విలియమ్స్, సుధీర్, వై.విద్యాసాగర్, ఎస్.సుధాకర్, జె.సంజీవ, ఖలీల్, నసీరుద్దీన్, మాధవి, అశోక్, రాజేందర్, సమీర్ ఇనాయత్ పాల్గొన్నారు.



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

పోడు సమస్యలు పరిష్కరించాలి



నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో పోడు భూములు, తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆయన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

పోడు రైతుల హర్షం..

పోడు భూముల సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడడంతో నియోజకవర్గంలోని పోడు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

కాలినడకన మేడారానికి..

- 25 సంవత్సరాలుగా తల్లులను దర్శించుకుంటున్న భక్తులు

చెన్నారావుపేట: మేడారం సమ్మక్క సారలమ్మల దీవెనల కోసం కాలినడకన జాతరకు వెళ్తున్నామని బుడిగజంగాల ఎక్త గ్రూప్ నాయకులు తుర్రాట్ బాబు, సారయ్య, కిశోర్, పస్తం శ్రీనివాస్ తెలిపారు. తొర్రూరు, కంటాయపాలెం, అమ్మాపురం, సాయినగర్ నుంచి మేడారం వరకు ప్రతి రెండు సంవత్సరాలకోసారి కాలినడకన వెళ్తామని చెప్పారు. సుమారుగా 200 మందిలో 50మంది చొప్పున గ్రూపులుగా ఏర్పడి 25 సంవత్సరాలుగా మేడారం వెళ్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం తొర్రూరులో బయలుదేరామని, సోమవారం నాటికి మేడారం చేరుకుంటామని తెలిపారు. తల్లులకు మొక్కులు చెల్లించుకుంటామని తెలిపారు. పాదయాత్రలో బేడ బుడిగ జంగాల సంఘం యూత్ నాయకులు కుమారస్వామి, సంజీవ, శ్రీనివాస్, సంతోష్, హుస్సేన్, ఏడుకొండలు, సంతోష్, అజయ్, సంపత్, సారయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.


పాదయాత్రగా మేడారం జాతరకు వెళ్తున్న ఎక్త గ్రూప్ నాయకులు

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న కారు.. డ్రైవర్ మృతి


సుధీర్(ఫైల్)

కొడకండ్ల: కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెంది నలుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం రామవరం గ్రామ శివారులో చోటు చేసుకొంది. ఎస్సై శ్రావణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన బండారి సుధీర్(24) తన సొంత కారులో అదే గ్రామానికి చెందిన నలుగురిని స్టేషన్‌ఘన్‌పూర్‌కు తీసుకెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో గ్రామ శివారులోని మూలమలుపు వద్ద అతివేగంగా ఉన్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. సుధీర్‌కు గాయాలవడంతో 108 వాహనంలో జనగామకు తరలిస్తుండగా మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న తండ సోమయ్య, లక్ష్మి, రామ్మోహన్, యాదమ్మ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ మృతికి కారణమైన నిందితుల అరెస్ట్



కాటారం: అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు వేసి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతికి కారణమైన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఐదు రోజుల వ్యవధిలోనే కేసును చేధించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్ వివరాలను వెల్లడించారు. కాటారం మండల కేంద్రానికి చెందిన ఊదరి రమేశ్, గోగుల రమేశ్, గజ్జెల శ్రీనివాస్ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కూలీ డబ్బులు కుటుంబ అవసరాలకు, సొంత ఖర్చులకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనకు వచ్చి విద్యుత్ తీగలు అమర్చి అటవి జంతువులను వేటాడి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో మండలంలోని నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతానికి సమీపంలో పంట పొలాలను ఆనుకొని అటవీ జంతువుల వేట కోసం సుమారు రెండు కిలో మీటర్ల మేర బైండింగ్ వైర్‌కు విద్యుత్ అమర్చి వదిలేశారు. ఈ నెల 11న అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో కూంబింగ్‌కు వెళ్లిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఆడె ప్రవీణ్(34) వేట కోసం అమర్చిన కరెంట్ తీగలకు తాకి మృతి చెందాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం రమేశ్ ఇంటి వద్ద నిందితులు ఉన్నారనే సమాచారం మేరకు సీఐ, ఎస్సై, సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి బైండింగ్ వైర్, వేటకు ఉపయోగించిన ఇతర సామగ్రిని స్వాధీనపర్చుకున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసును అతిత్వరగా చేధించిన సీఐ, ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు లక్ష్మిరాజు, హరికుమార్, ఇతర పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

పర్సంటేజీల కోసం కక్కుర్తి

- అక్రమాలకు కేరాఫ్ టీఎస్ ఎన్పీడీసీఎల్‌లోని ఆడివిజన్
- విడుదలైన సొమ్ముకంటే అధికంగా చెల్లింపులు



హన్మకొండ: పర్సంటేజీల కోసం కక్కుర్తి పడుతూ.. అధికారులు, ఉద్యోగులు ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తున్నారు. మంజూరైన బిల్లులకు మించి రెట్టింపు స్థాయిలో చెక్కులు జారీ చేస్తున్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని ఓ రూరల్ డివిజన్ అక్రమాలకు కేరాఫ్‌గా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా పూర్తయిన పనులు రికార్డు చేసి ఆమేరకు నిధులు విడుదల చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి వివరాలు పంపిస్తారు. ఈమేరకు ప్రధాన కార్యాలయం ఎల్‌ఓసీ రూపంలో నిధులు మంజూరు చేస్తుంది. రూరల్ డివిజన్ కార్యాలయంలో ఎల్‌ఓసీని పట్టించుకోకుండా అయిదుగురు కాంట్రాక్టర్లకు అదనంగా బిల్లులు చెల్లించారు. ఎల్‌ఓసీ మంజూరు కాని పనికి కూడా చెక్కు జారీ చేసినట్లు సమాచారం.

ఎంత ఎక్కువ రాస్తే అంత పర్సంటేజీ!

చెక్కు జారీ చేసిన క్రమంలో కాంట్రాక్టర్లు పర్సంటేజీలు ఇవ్వడం బహిరంగ రహస్యం. డివిజన్ కార్యాలయంలో 2 శాతం పర్సంటేజీ ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో ఎంత ఎక్కువ మొత్తం చెక్కు రాస్తే అదే మొత్తంలో పర్సంటేజీలు వస్తాయి. ఎల్‌ఓసీ రాకుండానే ఓ కాంట్రాక్టర్‌కు రూ.15.17 లక్షల చెక్కు జారీ చేశారు. అదేవిధంగా మరో కాంట్రాక్టర్ చేసిన పనికి రూ.67లక్షలు ఎల్‌ఓసీ ఇస్తే రూ.87లక్షలకు చెక్కు జారీ చేశారు. ఇక్కడ కాంట్రాక్టర్‌కు అదనంగా రూ.20 లక్షలు చెల్లించారు. మరో ముగ్గురికి సైతం ఇలానే అదనంగా చెల్లించినట్లు సమాచారం. గత ఏడాది ఇదే విధంగా అక్రమాలకు పాల్పడిన కొందరిపై యాజమాన్యం చర్యలు తీసుకుంది. అయినా ఉద్యోగుల్లో ఏ మాత్రం మార్పు రాలేదు. క్యాష్ బుక్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో డివిజన్‌లో ఎన్ని నిధులు అందుబాటులో ఉన్నాయి.. ఎన్ని నిధులు వచ్చాయి? ఎన్ని నిధులు అభివృద్ధి పనులకు చెల్లించాం. ఇతరత్రా వేటికి ఖర్చు పెట్టామనే వివరాలకు సంబంధించిన లెక్కలు ఎప్పటికప్పుడు క్యాష్‌బుక్‌లో నమోదు చేయట్లేదని తెలిసింది.

తప్పులతడకగా రికార్డులు

రికార్డులు తప్పుల తడకగా నిర్వహిస్తూ.. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. చెక్కులు జారీ అయిన రెండు మూడ్రోజుల తర్వాత మరో ఉద్యోగి ఎల్‌ఓసీలు, జారీ చెక్కులు పరిశీలించడంతో అక్రమాలు వెలుగుచూశాయి. అయితే ఇద్దరు కాంట్రాక్టర్లు అప్పటికే చెక్కులు వారి ఖాతాలో జమ చేశారు. మరో ముగ్గురి చెక్కులు వారి ఖాతాలో జమ చేయలేదు. జరిగిన పొరపాటును కార్యాలయ నిర్వహణాధికారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చెక్కులు తీసుకెళ్లిన కాంట్రాక్టర్లను పిలిపించుకుని విచారించారు. ఇవ్వాల్సిన బిల్లు కంటే ఎక్కువ మొత్తానికి చెక్కు ఇచ్చామని ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని చెప్పి కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేశారు. బ్యాంక్‌లో చెక్కులు వేసిన ఇద్దరి నుంచి తిరిగి డబ్బులు తీసుకోగా.. మరో ముగ్గురి నుంచి చెక్కులు వాపస్ తీసుకున్నట్లు విద్యుత్ ఉద్యోగ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయం టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి తెలియడంతో ఉన్నతాధికారులు వెంటనే విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు ప్రధాన కార్యాలయానికి చెందిన ఇద్దరు అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు ఆశపడి ఇష్టానుసారంగా చెక్కులు జారీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరిద్దరి నిర్వాకం వల్ల విద్యుత్ ఉద్యోగులందరికీ చెడ్డ పేరు వస్తుందని సహచర ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

హన్మకొండ అర్బన్: ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, రాజేష్, శ్యాంసుందర్, రామునాయక్, లక్ష్మీప్రసాద్, సారంగపాణి, రాజమౌళి, సలీం, సురేష్, రాజ్యలక్ష్మి, జయంతి ఉన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

- ఎంపికైన కానిస్టేబుళ్లకు అభినందనలు
- టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి


ఎంపికైన కానిస్టేబుళ్లను అభినందిస్తున్న కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

మామునూరు: ఎంపికైన కానిస్టేబుళ్లు 9నెలల శిక్షణను పూర్తి చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఈమేరకు శుక్రవారం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో ఉచితంగా కానిస్టేబుల్ శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఆయన అభినందించి, మాట్లాడారు. 300 మంది నిరుద్యోగ యువత టీఎస్ఎస్పీలో ఉచిత శిక్షణ పొందగా సుమారు 30 మందికి పైగా కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రజల రక్షణ కోసం నిరంతరంగా పనిచేసేది పోలీసు మాత్రమేనని అన్నారు. పోలీసు వృత్తి అత్యంత పవిత్రమైందని, పోలీసు ఉద్యోగాన్ని క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే శాఖపరమైన గుర్తింపు లభిస్తుందని కమాండెంట్ సూచించారు. అభ్యర్థులు పట్టుదలతో కష్టపడి లక్ష్యాలను సాధించి జీవితంలో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీ రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంత దేశ నిర్మాణానికి ఫిట్ ఇండియా

- అర్జున అవార్డు గ్రహీత జోసెఫ్ జీ.అబ్రహం
- నిట్‌లో ప్రారంభమైన ఇంటర్ నిట్ అథ్లెటిక్స్


పోటీల్లో పాల్గొన్న వరంగల్ నిట్ క్రీడాకారులు

కాజీపేట అర్బన్: ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణానికి భారత ప్రభుత్వం ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తుందని ఇంటర్ నేషనల్ అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత జోసెఫ్ జీ.అబ్రహం తెలిపారు. నిట్ వరంగల్‌లోని స్టేడియంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఇంటర్ నిట్ అథ్లెటిక్స్, ఖోఖో టోర్నమెంట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా అబ్రహం హాజరై, పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. శక్తివంతంగా ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతి విద్యార్థి క్రీడలకు తప్పకుండా సమయం కేటాయించాలని సూచించారు. క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ విజేతలుగా నిలవాలని, నిట్ ఇంటర్ అథ్లెటిక్స్, ఖోఖో టోర్నమెంట్స్‌ను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శారీరక దృఢత్వానికి క్రీడలు తోడ్పడుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. దేశవ్యాప్తంగా 20 ఎన్ఐటీల నుంచి 800మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నిట్ పీఈడీ దయానిధి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేటెంట్స్‌తో విస్తృత ఉపాధి అవకాశాలు

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: పేటెంట్స్‌తో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అన్నారు. ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెల్ ఆధ్వర్యంలో కేయూలో శుక్రవారం నిర్వహించిన ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్)పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పేటెంట్స్ వాటి ఆవశ్యకత, కెరీర్ దానికి ఉన్న సంబంధం గురించి వివరించారు. విషయంపై మరింతగా అవగాహన అవసరం అన్నారు. పరిశోధకులు, విద్యార్థులు ఆదిశగా ఆలోచించాలని సూచించారు. వక్తలుగా వచ్చిన హైదరాబాద్ అశ్లాండ్ పేటెంట్స్ స్పెషలిస్టు డైరెక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ.. పేటెంట్లను నమోదు చేసుకునే విధానం, వాటి పరిధి, ఎవరు అర్హులు, నిబంధనలు ఎలాంటి అంశాలు పరిశోధనలు పేటెంట్ పరిధిలోనికి వస్తాయనేది వివరించారు. హైదరాబాద్ అశ్లాండ్ పేటెంట్స్ స్పెషల్ లిస్టు మరో డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ.. పేటెంట్స్‌కి నిజజీవితానికి ఉన్నసంబంధం పేటెంట్స్ వల్ల కలిగే లాభాలు, వాణిజ్యపరంగా పరిశోధనలపరంగా ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయనేది వివరించారు. అనంతరం ఐపీఆర్ సెల్ కేయూ నోడల్ అధికారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడారు.

మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లు

- నిజామాబాద్- వరంగల్..
- సిర్పూర్ కాగజ్‌నగర్ - వరంగల్..
- 21 నుంచి 24వ తేదీ వరకు అమలు



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే అధికారులు మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిజామాబాద్- వరంగల్- నిజామాబాద్ మధ్య, సిర్పూర్ కాగజ్‌నగర్ - వరంగల్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు.

నిజామాబాద్- వరంగల్ స్పెషల్ ట్రైన్

నిజామాబాద్- వరంగల్ (07019) ఎక్స్‌ప్రెస్ నిజామాబాద్‌లో ఉదయం 7:05 గంటలకు బయలుదేరి వరంగల్‌కు మధ్యాహ్నం 1:45 గంటలకు చేరుతుంది. అదేవిధంగా వరంగల్-నిజామాబాద్ (07020) ఎక్స్‌ప్రెస్ వరంగల్‌లో మధ్యాహ్నం 3గంటలకు బయలుదేరి రాత్రి 10:30 గంటలకు నిజామాబాద్‌కు చేరుతుంది. వరంగల్-నిజామాబాద్ మధ్య ఈ రైళ్ల సర్వీస్‌లకు కాజీపేట జంక్షన్, పెండ్యాల్, ఘన్‌పూర్, రఘునాథపల్లి, జనగామ, ఆలేరు, వంగపల్లి, భువనగిరి, బీబీనగర్, ఘట్‌కేసర్, చర్లపల్లి, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, బొల్లారం, మేడ్చల్, మనోహరబాద్, వదిరాం, మిర్జాపల్లి, అక్కన్నపేట, కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

సిర్పూర్ కాగజ్‌నగర్ - వరంగల్ స్పెషల్ ట్రైన్

సిర్పూర్ కాగజ్‌నగర్ - వరంగల్ ప్రత్యేక రైలు (07017) సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి 10 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. అదేవిధంగా వరంగల్ టు సిర్పూర్ కాగజ్‌నగర్ (07018) రైలు సాయంత్రం 4 గంటలకు వరంగల్‌నుంచి బయలుదేరి రాత్రి 12 గంటలకు కాగజ్‌నగర్‌కు చేరుకుంటుంది. సిర్పూర్‌కాగజ్‌నగర్-వరంగల్ మధ్య కాజీపేట టౌన్, హసన్‌పర్తి, ఉప్పల్, జమ్మికుంట, బిజిగిరి షరీఫ్, కొత్తపల్లి, ఓదెల, కొలనూరు, కొత్తపల్లి, పెద్దపల్లి, రాఘవపురం, రామగుండం, పెద్దంపేట్, మంచిర్యాల, రవీంద్రఖని, మందమర్రి, బెల్లంపల్లి, రేచిని రోడ్డు, రేపల్లెవాడ, ఆసిఫాబాద్, రాళ్లపేట్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

మేడారం ముచ్చట్లు

జాతరకు ఐదుగురు ఐఏఎస్ నోడల్ అధికారులు

ఏటూరునాగారం: ఈనెల 17నుంచి 24వరకు మేడారం మహా జాతరలో ఏర్పాట్లు, పనులు జాతర విజయవంతం చేసేందుకు సీఎస్ శాంతికుమారి ఐదుగురు ఐఏఎస్‌లను నోడల్ అధికారులుగా కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, డైరెక్టర్ లేబర్ కమిషన్ అధికారి కృష్ణ ఆదిత్య, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తాలను ప్రభుత్వం నియమించగా వారు శనివారం నుంచి జాతర నిర్వహణలో పాల్గొననున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాఖల వారీగా చర్యలు తీసుకొని, మానిటరింగ్ చేయడానికి ఐదుగురు ఐఏఎస్‌లను నియమించారు.

సమ్మక్క పూజారిగా సిద్ధబోయిన నితిన్



ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క సారలమ్మ పూజారిగా సిద్ధబోయిన నితిన్‌ని సమ్మక్క సారలమ్మ పూజారులు నియమించారు. సమ్మక్క పూజారి సిద్ధబోయిన లక్ష్మణ్‌రావు గత కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అయన కుమారుడు నితిన్‌ను పూజారిగా నియమించారు. దేవాదాయ శాఖ అధికారులకు తీర్మాన పత్రాన్ని అందించినట్లు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు తెలిపారు. సమ్మక్క పూజారిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ తొలిసారిగా ఈ ఏడాది సమ్మక్క తల్లి వనంలో నుంచి గద్దె పైకి తీసుకొచ్చే ప్రధాన పూజారుల సభ్యుల్లో ఒక్కడు. చిన్న వయస్సులోనే తల్లులకు సేవ చేసే భాగ్యం కలుగనుందని పూజారి నితిన్ తెలిపారు.

మేడారం జాతర కంట్రోల్ రూమ్ ప్రారంభం


సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతర కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీజతో కలిసి శుక్రవారం ప్రారంభించి, మాట్లాడారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1800-425-0620 ను సంప్రదించాలని తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ 19వ తేదీ నుంచి భక్తులకు అందుబాటులోకి వస్తుందన్నారు. జాతరలో మొత్తం 382 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ అందుబాటులో ఉంటాయని, జాతరలో ఎనిమిది జోన్లుగా 42 సెక్టార్స్‌గా విభజించి ప్రతి జోన్‌లో నోడల్ అధికారి, జోనల్ అధికారి, సెక్టోరల్ అధికారి విధుల్లో ఉంటారని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ వేణు గోపాల్, జిల్లా ఈ-డిస్ట్రిక్ మేనేజర్ దేవేందర్, అధికారులు పాల్గొన్నారు.

హత్యకేసులో పదిమంది అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ మల్లయ్య


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ఆదర్శనగర్ కాలనీలో ఇటీవల జరిగిన రౌడీషీటర్ హత్యకు వేధింపులే కారణమని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. పది మంది నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిల్స్‌కాలనీ ఎస్సైలు వెంకన్న, గోవర్ధన్, మున్నీర్ ఉల్లాతో కలిసి ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ రంగంపేట కేఎంసీ ప్రాంతానికి చెందిన దుట్టా శ్రీనివాస్(33)కు 2015 సంవత్సరంలో రంగశాయిపేట ఆదర్శనగర్‌కు చెందిన బజ్జూరి రమేష్, విజయ దంపతుల కుమార్తె రమ్యకు వివాహం జరిగింది. ఏడాది తర్వాత శ్రీనివాస్ -రమ్యను మానసిక, శారీరక, వేధిస్తుండగా.. మహిళా పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేశారు. పెద్దల సమక్షంలో పంచాయితీ చేసినా మార్పురాకపోవడంతో రమ్య విడాకుల కోసం అప్లై చేసింది. దీంతో రమ్యపై శ్రీనివాస్ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం ప్రచారం చేస్తుండగా.. మిల్స్ కాలనీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు రమ్యను హైదరాబాద్ హాస్టల్‌లో ఉంచారు. ఈనెల 11 నుంచి 15వరకు రంగశాయిపేటలో జరుగుతున్న బొడ్రాయి వేడుకలకు రమ్య, ఆమె స్నేహితురాలు మేకల అలేఖ్య, కుమారుడు అఖిల్ ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న దుట్టా శ్రీనివాస్ 13న సాయంత్రం 6గంటలకు అత్తారింటి చుట్టూరా బైక్‌పై తిరుగుతూ నీ అంతు చూస్తా, చంపుతా అని బెదిరించాడు. దీంతో శ్రీనివాస్‌ను ఎలాగైన చంపాలని రమ్య తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో రాత్రి 10:20 గంటలకు శ్రీనివాస్ తన మోటార్ సైకిల్‌పై అత్తారింటి ముందుకు చేరి బూతులు తిట్టడం మొదలెట్టాడు. దీంతో బజ్జూరి అఖిల్ శ్రీనివాస్‌ను రాయితో కొట్టగా బైక్‌పై నుంచి కిందపడడంతో కుటుంబ సభ్యులు, మరికొందరి సాయంతో శ్రీనివాస్‌ను కొట్టి చంపారు. ఈనేపథ్యంలో మృతుడి తండ్రి దుట్ట వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బజ్జూరి రమేష్, దుట్ట(బజ్జూరి) రమ్య, బజ్జూరి అఖిల్, బజ్జూరి విజయ, బజ్జూరి సుధాకర్, బజ్జూరి శేషి, ఆకుతోట అనసూర్య, తోట మల్లికాంబ, నీరటి సాంబయ్య, మేకల అలేఖ్యను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

పాలేరు నుంచి రాష్ట్ర కార్యదర్శిగా..

- అడవిలోనే ఓనమాలు నేర్చుకున్న అశోక్
- 37 సంవత్సరాలకు పోలీసుల చేతికి చిక్కిన వజ్జయ్య


అశోక్


అశోక్‌ను విడుదల చేయాలని బయ్యారంలో ఆందోళన చేస్తున్న నాయకులు

బయ్యారం: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కుర్సం వజ్జయ్య అలియాస్ అశోక్ పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు బాల్యంలో వజ్జయ్యను ఓ రైతు వద్ద పాలేరుగా పెట్టారు. ఆ సమయంలో బయ్యారం మండల ఏజెన్సీలో అప్పటి ప్రజాపంథా ఇప్పటి న్యూడెమోక్రసీ ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. ఈ క్రమంలో వజ్జయ్య నక్సల్స్ సిద్ధాంతాలకు ఆకర్షితుడై పాలేరుగా పనిచేస్తున్న సమయంలోనే దళసభ్యుడిగా ఉద్యమంలో చేరాడు. నిరక్షరాస్యుడిగా పార్టీలో చేరిన వజ్జయ్య తన పేరును అశోక్‌గా మార్చుకోవడంతోపాటు నాయకుల ప్రేరణతో చదువు నేర్చుకున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దులో బలమైన విప్లవపార్టీకి అజ్ఞాత నాయకుడిగా కొనసాగుతున్న అశోక్‌ను హతమార్చటమే లక్ష్యంగా మావోయిస్టు, ప్రజాప్రతిఘటన, ప్రతిఘటన, చలమన్న పార్టీలు పలుమార్లు దాడులు జరిపాయి. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీకి చెందిన దళాలు మండలంలోని భీరోనిమడువ అటవీప్రాంతంలో అశోక్ దళంపై దాడి జరిపి ఆయుధాలను ఎత్తుకెళ్లగా అశోక్ క్షేమంగా బయటపడ్డాడు. ప్రజాప్రతిఘటనకు చెందిన శంకరన్న సైతం అశోక్ లక్ష్యంగా దాడులు జరపగా చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఈక్రమంలో 37 సంవత్సరాలకు అశోక్ పోలీసులకు చిక్కాడు. నక్సల్స్ దళనేతగా కొనసాగుతున్న సమయంలో ఇర్సులాపురం గ్రామానికి చెందిన ఎనుగుల మల్లేష్, బండారి మల్లయ్య, అడ్వకేట్ రూపిరెడ్డి రవీందర్‌రెడ్డి, జగత్‌రావుపేట గ్రామానికి చెందిన పర్శిక బొర్రయ్య, బయ్యారానికి చెందిన గోపి హత్య కేసులు అశోక్‌పై నమోదయ్యాయి. వీటితో పాటు ఇతర కేసులు సైతం ఉన్నట్లు తెలుస్తుంది.

అశోక్, గోపన్నను విడుదల చేయాలి..

పోలీసులు అదుపులోకి తీసుకున్న అశోక్, గోపన్నతోపాటు పుల్లన్నను విడుదల చేయాలని కోరుతూ న్యూడెమోక్రసీలోని ఇరువర్గాల ఆధ్వర్యంలో మండలంలోని బయ్యారం, గంధంపల్లి- కొత్తపేట, వెంకట్రాంపురంలో ఆందోళనలు నిర్వహించారు. నాయకులు ఐలయ్య, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, పద్మ, భిక్షం, వీరభద్రం, మధు, నాగేశ్వరరావు, కుమారి పాల్గొన్నారు.

అశోక్, గోపన్నను కోర్టులో హాజరుపర్చాలి

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కాశిబుగ్గ: మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసులు గత రాత్రి అరెస్టు చేసిన న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి గోపన్నలను తక్షణమే కోర్టులో హాజరుపరచాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. కాశిబుగ్గ జంక్షన్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేసి, మాట్లాడారు. అశోక్, గోపన్నలు భూస్వామ్య పెట్టుబడి దారి సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా విప్లవోద్యమంలో పని చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఎలాంటి హానీ తలపెట్టకుండా కోర్టులో హాజరు పరచాలని కోరారు. వారితో పాటు అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొని ఐలయ్య, మహబూబాబాద్ జిల్లా న్యూడెమోక్రసీ నాయకులు పుల్లన్న కూడా అరెస్టు చేశారని వారిని కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ఆరెల్లి కృష్ణ, అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వర రావు బన్ను నర్సింగం, జన్నారం రాజేందర్, గద్దల ప్రభాకర్, రాజు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్‌కు జీవితఖైదు


- భార్యను చంపిన కేసులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాధాదేవి తీర్పు

వరంగల్ లీగల్ : అనుమానం అనే పెనుభూతంతో కట్టుకున్న భార్యను చిత్రహింసలకు గురిచేసి చంపిన నేరంలో నేరస్తుడు పోలీస్ కానిస్టేబుల్‌కు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన తస్మీన సుల్తానాను, వరంగల్ నగర సమీపంలోని తిమ్మాపూర్ పింఛన్‌పురకు చెందిన మహ్మద్ ఆయూబ్‌ఖాన్‌కు ఇచ్చి 2006సంవత్సరంలో వివాహం చేశారు. అయూబ్‌ఖాన్ రఘునాథ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ భార్య ఇద్దరు కుమారులను పోషించేవాడు. కాలక్రమేణా తన భార్య మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందని అయూబ్‌ఖాన్ అనుమానించి, తరచూ భార్యను మానసికంగా, శారీరకంగా హింసించసాగాడు. బాధితురాలు తన తల్లిదండ్రులు, సోదరుడికి తెలుపగా పలుమార్లు అయూబ్‌ఖాన్‌ను మందలించారు. ఈ క్రమంలో 2020 జూన్ 5న తస్మీన సుల్తానా తన అన్నకు ఫోన్ చేసి వెంటనే పింఛన్‌పురకు రావాలని, తన భర్త తీవ్రంగా హింసిస్తున్నాడని తెలిపింది. వారు వచ్చేలోగా.. మామునూర్ క్వార్టర్స్ వద్ద తస్మీన సుల్తానా మృతిచెంది ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అయూబ్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం అయూబ్‌ఖాన్‌కు శిక్ష విధిస్తూ జడ్జి రాధాదేవి తీర్పు వెల్లడించారు.

వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

నయీంనగర్ : ఎంఎస్ఎంఈ- డీఎఫ్ఓ, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం, హైదరాబాద్, హనుమకొండ పరిశ్రమల కేంద్రం సహకారంతో హరిత హోటల్‌లో రెండు రోజుల పాటు (15,16తేదీల్లో) నిర్వహించిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ఈ ప్రోగ్రాం పీఎస్‌యూలు, ఎంఎస్ఎంఈలకు మధ్య వ్యాపార అనుసంధాన ప్రయోజనం కోసం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.శివరామప్రసాద్ ఎంఎస్ఎంఈ పథకాలను ఎంఎస్ఎంఈలు వ్యాపారవృద్ధి, నైపుణ్యం పెంపుదల, మార్కెటింగ్ సౌకర్యాలు, సబ్సిడీ రుణాలను పొందడం, సాంకేతిక అప్‌గ్రేడేషన్, స్వావలంబన, వ్యవస్థాపనలను ప్రోత్సహించేందుకు ఉపయోగించుకోవచ్చని వివరించారు.

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.

- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి
- కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది
- చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది
- నోటి దుర్వాసన ఉంటుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది
- వాంతి వచ్చినట్టుగా... వికారంగా అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

పైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరఫు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...



ముందస్తు ప్రణాళిక ...

పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...

పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వసారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.



అలంకరణ సామగ్రి

పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360



శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్



ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయిలను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.



సినిమా

దేవర డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం



● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం



● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.


మళ్లీ వస్తున్నాడు జోకర్



● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ' సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్



● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!



● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య



● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...



● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వవ్వారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...



● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు



● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్శికా జంటగా చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.